క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ నాయకులు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కమిషన్ ఎం.కృష్ణ గ్రేడ్-1 కమిషనర్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు బుధవారం ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు తదితరులు ఆయనను సన్మానించారు. శాలువాలు, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ పదోన్నతి పొంది తిరిగి ఆదోని మున్సిపల్ కార్యాలయంలోనే కొనసాగడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆయన సేవలు మరువలేనిదన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు దేవిశెట్టి ప్రకాష్, ధణాపురం శేషన్న, కత్తి హనుమంతరావు, రిటైర్డ్ తహసీల్దార్ షేక్షావలి, గౌరవ సలహాదారుడు వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



పట్టుబడిన మద్యం, నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ డాక్టర్ నాయక్

ఆదోని రూరల్: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న బోయ వీరేష్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్‌ఐ డాక్టర్ నాయక్ బుధవారం తెలిపారు. ఆదోని పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన బోయ వీరేష్ కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప తాలూకాలోని నాగరహాల్ గ్రామంలోని వైన్‌షాపులో కర్ణాటక మద్యం 90 ఎం.ఎల్. పరిమాణం గల ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ (9 బాక్సులు) ఆటో(ఏపీ21 టీజెడ్ 6047)లో తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. మద్యం బాక్సులను, ఆటోను సీజ్ చేశామన్నారు. బోయ వీరేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.


ప్రశాంతంగా వేలం పాటలు



వేలం పాటలు నిర్వహిస్తున్న డీఎల్‌పీవో, డిప్యూటీ ఎంపీడీఓ

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన పంచాయతీ షాపులకు బుధవారం వేలం పాటలు నిర్వహించారు. మొత్తం 11 షాపులు ఉండగా ఆరు షాపులకు వేలం పాటలు వేసినట్లు సర్పంచ్ ఉచ్చప్ప, ఆదోని డివిజనల్ పంచాయతీ అధికారిణి (డీఎల్‌పీఓ) నూర్జహాన్ తెలిపారు. షాప్-1 రూ.2600, షాపు-2 రూ.1400, షాపు-3 రూ.1100, షాపు-4 రూ.1000, షాపు-5 రూ.1300, షాపు-6 రూ.1000 చొప్పున పాటదారులు దక్కించుకున్నారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా వేలం పాటలు జరిగాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, మల్లికార్జున పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



ఎంపీడీఓ వెంకటేశ్వర్లుతో మాట్లాడుతున్న ప్రజలు

కోసిగి: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ వెంటేశ్వర్లు సూచించారు. బుధవారం కోసిగిలోని సచివాలయం-4లో ఉదయం 11.30 గంటలైనా ఉద్యోగులు రాకపోవడంతో ప్రజలు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆయన అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సచివాలయంలో ఆధార్ కార్డు ఎంట్రీ, మార్పులు చేర్పులు, కొత్త రేషన్ కార్డు, కార్డుల్లో పేర్లు మార్పుల కోసం ప్రజలు అక్కడి వేచి వున్నారు. దీంతో ఎంపీడీఓ సచివాలయ ఉద్యోగస్తుల పై మండి పడి వేళకు రాకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

దరఖాస్తు చేసుకోండి

పెద్దకడబూరు : పెద్దకడబూరు మండలంలోని కస్తూర్బా కళాశాలలో ఇంటర్మీడియెట్ అడ్మిషన్ కోసం పదవ తరగతి పాస్ అయిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్స్‌పాల్ రుక్సానా పర్వీన్ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ తమ కళాశాలో ఇంటర్ కేవలం ఎంపీసీ గ్రూప్ మాత్రమే ఉందన్నారు. రెండో సంవత్సరంలో 24సీట్లు, మొదటి సంవత్సరంలో 31 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. ఈ కాలేజీలో చేరేందుకు ఎలాంటి రిజర్వేషన్‌లు లేవన్నారు. పదవ తరగతి పాస్ అయిన ప్రతి విద్యార్థిని దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు ఫారాన్ని కాలేజీలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

‘రియల్’ మాయాజాలం!

- మంత్రాలయంలో భూముల ధరకు రెక్కలు
- బైపాస్ రోడ్డు పేరుతో ఆర్భాటం
- అమాంతంగా విస్తరిస్తున్న రియల్ వెంచర్లు
- సామాన్యుడికి అందనంతగా పెరిగిన రేట్లు



సూగూరు రోడ్డులో వేసిన కొత్త ఎస్టేట్



బైపాస్ రోడ్డు సమీపంలో కొత్తగా వెలసిన వెంచర్

మంత్రాలయం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో రియల్టర్ల మాయాజాలం వర్ధిల్లుతోంది. భూముల ధరలకు రెక్కలు తొడిగారు. సామాన్యుడికి ఇంటి స్థలం అందని ద్రాక్షగా మార్చేశారు. బైపాస్ రోడ్డు పేరుతో భూమాయను పచ్చని సాగు పొలాలకు పాకించారు. రూ.లక్షలు పలికే భూములను రూ.కోట్లకు చేర్చారు. డబ్బున్నోడిదే భూమిగా మార్చేసి సామాన్యుడికి కన్నీళ్లు తెప్పిస్తున్నారు. మంత్రాలయం పేరుకు తగ్గట్టుగా బైపాస్ మాయతో పెద్ద భూం.. సృష్టించారు. పెద్దపెద్ద పట్టణాల్లో లేనంతగా ఇక్కడ రియల్ భూం సాగిపోవడం ఆశ్చర్యకరం.

భూముల ధరలకు రెక్కలు

మంత్రాలయం-ఎమ్మిగనూరు రోడ్డులో కల్లుదేవకుంట సమీపం నుంచి రాయచూరు మార్గంలోని చెట్నిహళ్లి వరకు బైపాస్ రోడ్డు నిర్మించనున్నారు. మంత్రాలయానికి మూడు కిలోమీటర్ల దూరం నుంచి ఈ రోడ్డు ఏర్పాటు కానుంది. బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టకముందే ఇక్కడి రియల్టర్లు మంత్రాలయం పట్టణం, బైపాస్ రోడ్డు మధ్యలో ఉన్న పంట పొలాలపై పడ్డారు. ఈ మధ్య ఉన్న భూములకు విపరీతంగా ధరలు పెంచారు. ఏడాది క్రితం పట్టణానికి కిలోమీటర్ దూరంలో ఉన్న ఎకరం పొలం రూ.1.30కోట్లు ధర పలికింది. ప్రస్తుతం అదే భూమి ధర రూ.4 కోట్లు పైమాటే. రోడ్డు ఎమ్మిగనూరు మార్గంలో రోడ్డును ఆనుకుని ఉన్న సెంటు స్థలం రూ.13 లక్షలు పలుకుతోంది. అదే సెంట స్థలం నిన్నటి వరకు రూ.5 లక్షలు ఉండేది. సూగూరు రోడ్డులో నల్లరేగడి పొలాన్ని ఓ చౌదరి రూ.77 లక్షలకు ఎకరం చొప్పున పొలాన్ని విక్రయించాడు. అదే పొలం నిన్నటి వరకు కేవలం రూ.12 లక్షలు ఉండేది. మంత్రాలయానికి నైరుతి దిశ, కల్లుదేవకుంట, చెట్నిహళ్లి రోడ్లలో ఈ రియల్ భూం అమాంతంగా పెరిగింది. ఇక్కడితో ఆగకుండా చెట్నిహళ్లి గ్రామాన్ని దాటుకుని వెళ్లింది. చెట్నిహళ్లి గ్రామంలో రోడ్డు వెంట ఎకరం పొలం రూ.15 లక్షలు ఉండేది. ప్రస్తుతం అక్కడ కూడా ఎకరం ధర రూ.4 కోట్లు పైమాటే.

విచ్చలవిడిగా వెంచర్లు

మంత్రాలయం పుణ్యక్షేత్రం చుట్టూ 4 కి.మీ. లోపల ఉన్న పొలాలన్నీ వెంచర్లుగా మారిపోతున్నాయి. కల్లుదేవకుంట రోడ్డులో కొత్తగా 20 ఎకరాలకు పైగా పంట పొలాల్లో రియల్ ఎస్టేట్లు వెలిశాయి. సూగూరు రోడ్డు మార్గంలో కొత్తగా 25 ఎకరాల్లో వెంచర్లు పడ్డాయి. చెట్నిహళ్లి గ్రామ పరిధిలో 100 ఎకరాల పొలాలుగా ఎస్టేట్లుగా మారిపోయాయి. చెట్నిహళ్లి దాటిన తర్వాత జాతీయ రహదారి ఇరువైపులా వెంచర్లు వేశారు. బైపాస్ రోడ్డు వెళ్తున్న చోట పాత వెంచర్లకు సైతం కొంత హంగులు దిద్దుతున్నారు. దాదాపు పదేళ్లుగా మూలన పడ్డ వెంచర్లకు కొత్త కళ వచ్చింది. నిన్నటి వరకు ఆ వైపు చూడని వ్యాపారులు అక్కడ ప్లాట్లు, పొలాలు కొనేందుకు క్యూ కడుతున్నారు.

సామాన్యులకు గడ్డుకాలం

మంత్రాలయంలో 80 శాతం ప్రజలు పేద, మధ్యతరగతి వారే. శ్రీమఠంలో, ప్రైవేటు లాడ్జీలు, హోటళ్లలో పనులు చేసుకుని కాలం వెల్లదీస్తున్నారు. మంత్రాలయం ఎక్కువగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన స్థితిమంతులే ఇక్కడ వ్యాపారాలు సాగిస్తున్నారు. అతి తక్కువ మంది ఇక్కడ లాడ్జీలు, హోటళ్లు కట్టించుకున్నారు. నిన్న మొన్నటి వరకు రూ.వేలల్లో ఇంటి స్థలాలు ఉండగా ప్రస్తుతం లక్షలకు ఎగిశాయి. రాఘవేంద్రపురంలో నిరుడు సెంటు రూ.2-3 లక్షలు పలుకగా ప్రస్తుతం రూ.6 లక్షలకు చేరింది. లాడ్జి చుట్టూ సెంటు రూ.15 లక్షలు పలుకుతోంది. కల్లుదేవకుంట గ్రామం రోడ్డు వైపు సెంటు రూ.13 లక్షలు ఉండగా కాస్త లోపలికి రూ.7 లక్షలు ఉంది. రియల్ మాయాజాలంతో సామాన్యులు సెంట స్థలం కొనాలన్న రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. కూలి పనులు చేసుకుని బతుకు సాగించే పేదవాడికి ఇక్కడ ఇంటి కల కల్లే. ఇప్పుడున్న రేట్లను చూస్తే ఇల్లు కట్టడేమోగానీ సెంటు భూమి కొనడం ఇబ్బందేనని ప్రజలు వాపోతున్నారు. ఇతర ప్రాంతాల వాళ్లు ఇక్కడ వచ్చి వాలడంతో భూముల రేట్లు పెరగడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి నేడు ఆఖరు

కోసిగి: మండల కేంద్రం కోసిగి ఏపీ మోడల్ స్కూల్లో ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు గురువారం సాయంకాలంలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సమీరారెడ్డి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. గడువు ముగిసిన తర్వాత ఆఫ్‌లైన్‌లో తీసుకునే అవకాశం లేదన్నారు.


క్యాంటీన్ పరిశీలన



అన్నా క్యాంటీన్‌లో అల్పాహారం నాణ్యత తెలుసుకుంటున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో అల్పాహారం, భోజన పంపిణీని బుధవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. సోమప్ప సర్కిల్‌లోని క్యాంటిన్‌లో అల్పాహారం నాణ్యతను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. క్యాంటిన్‌లో శుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు.

హామీలకే దిక్కులేదు.. మళ్లీ కొత్త పథకాలా?



ఎస్.గోపాల్‌రెడ్డి

ఆదోని టౌన్: సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికే దిక్కులేదు, కేబినేట్‌లో కొత్త పథకాలను ప్రకటించడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.గోపాల్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ వస్తోందన్నారు. ఇంటి వద్దకే రేషన్ అందిస్తున్న వాహనాలను తొలగించిందన్నారు. మంగళవారం జరిగిన కేబినేట్ సమావేశంలో రేషన్ అందించే వాహనాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. దీంతో వృద్ధులు, వికలాంగులు రేషన్‌షాపుల వద్దకు వెళ్లి రేషన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ప్రభుత్వంపై పోరాటాలకు పూనుకుంటామని హెచ్చరించారు.

వంద పడకల అసుపత్రి ప్రారంభం



అసుపత్రిలో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో నూతనంగా నిర్మించిన వంద పడకల ఏరియా హాస్పిటల్‌ను బుధవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రూ. 12.60 కోట్ల ఖర్చులో నూతనంగా వంద పడల ఆసుపత్రి భవన నిర్మాణం చేసి రోగులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. మెరుగైన వైద్యం అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. హాస్పిటల్‌లో త్వరలోనే క్రిటికల్ కేర్‌ను తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి, సూపరింటెండెంట్ డాక్టర్ సుధా, మున్సిపల్ కమిషన్ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గతం మరిచి ఎమ్మెల్యేను విమర్శించడం తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మంత్రాలయం : ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని విమర్శించే స్థాయి మాధవరం రామిరెడ్డి కుటుంబానికి లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి ఈరన్న, పెద్దకడబూరు మాజీ ఎంపీపీ రఘురామ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, సర్పంచు రామాంజినేయులు అన్నారు. బుధవారం ఎమ్మిగనూరులోని భీమా నిలయంలో వారు మీడియాతో మాట్లాడారు. మంగళవారం జరిగిన టీడీపీ మినీ మహానాడు సభలో మాధవరం రామిరెడ్డి కుమారుడు రామకృష్ణారెడ్డి గతాన్ని మరిచి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీలో రామిరెడ్డికి కేడీసీసీ చైర్మన్ ఇప్పించి ఆ కుటుంబానికి గుర్తింపు తెచ్చిపెట్టింది ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డినే నని గుర్తు చేశారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని రామ్మకృష్ణారెడ్డి ఇలా నోటికి వచ్చినట్లు మాట్లాడటం శోచనీయమన్నారు. ఎమ్మెల్యే గత ప్రభుత్వం హయాంలో గవిగట్టు, హెచ్.మురవణి గ్రామాల్లో స్కూళ్ల కోసం సొంతంగా డబ్బులు ఖర్చు చేసి స్థలాలు కొనిచ్చారని గుర్తుచేశారు. ఇవేమీ తెలియకుండా ఆయనపై దుష్ప్రచారం చేయడం విజ్ఞత అనిపించుకోదన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో పావలా అభివృద్ధి చేయలేదని టీడీపీ నాయకుడు ఎన్.రాఘవేంద్రరెడ్డి పలకడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధి ఏంటో నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు



నిందితులను చూపుతున్న ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి

పెద్దకడబూరు : మండల పరిధిలోని ముచ్చగిరి గ్రామంలో ఈనెల 7వ తేదీన జరిగిన చోరీ కేసులో నిందితులను అరెస్టు చేసి వారి నుంచి డబ్బు, బంగారు, వెండిని రికవరీ చేసినట్లు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన వివరాలను వెల్లడించారు. ఈనెల 7న ముచ్చగిరి గ్రామానికి చెందిన కురుక మహాదేవకు చెందిన 18గ్రాముల బంగారు ఆభరణాలు, గుడిసెల రంగమ్మకు చెందిన 6గ్రాముల బంగారు ఆభరణాలు, 24తులాల వెండి ఆభరణాలు, రూ.51వేల నగదు దొంగతనానికి గురి అయ్యాయన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 11వ తేదీన కేసు నమోదు చేసి, ఛేదించినట్లు తెలిపారు. బుధవారం అదే గ్రామానికి చెందిన బోయ ఉరుకుందు, సూగూరు హరికృష్ణ, బోయ నరసింహులు గ్రామం బయట అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అరెస్టు చేసి, వారి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నాట్లు వెల్లడించారు.



కే.పేట గ్రామంలో ప్రధాన రహదారిలో నిలిచిన మురుగు నీరు

మురుగంతా రోడ్డుపైనే

నందవరం : మండల పరిధిలోని కనకవీడు పేట గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగు నీరు నిలిచింది. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో బస్టాండ్ ఆవరణ, గ్రామ సచివాలయం సమీపంలో రోడ్డులో మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తిచెంది రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు ప్రధాన రహదారిలో డ్రైనేజీలు నిర్మించాలని విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారిలో ఇరువైపుల డ్రైనేజీలు నిర్మించాలని కోరుతున్నారు.

రైతులకు ఫాంపాండ్లపై అవగాహన కల్పించండి

నందవరం : గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులకు తమ పొలాల్లో ఫాంపాడ్స్(నీటి కుంటలు) తవ్వించుకునేలా అవగాహన కల్పించాలని ఉపాధి అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఫాంపాడ్లు తవ్వించుకోవడంతో రైతుల పొలాల్లో వర్షాకాలంలో వర్షపు నీటిని ఒడిసి పట్టి పొలాలకు వాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నరసింహులు పాల్గొన్నారు.

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు, ఫీజుల పేరుతో తల్లిదండ్రులతో వేలాది రూపాయలు దోపిడీ చేస్తున్నారని ఏఐఎస్‌ఎఫ్ పట్టణ అధ్యక్షుడు విష్ణు ఆరోపించారు. బుధవారం పట్టణంలో సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆయా పాఠశాలల్లో అక్రమ డొనేషన్లు వసూలు చేయడంతో పాటు నర్సరీ ఆపై విద్యార్థులకు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు శ్రీను,రవి, పరమేష్, రాజు, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనుల్లో పురోగతి సాధించాలి

మంత్రాలయం రూరల్ : ఉపాధి హామీ పెండింగ్ పనుల్లో పురోగతి సాధించాలని ఎంపీడీఓ నూర్జహాన్ ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మంత్రాలయం మండల కేంద్రంలోని మండల పరిసత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏ, సీఓలతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో భాగంగా చిన్న, సన్న కారు రైతులకు ఫాంపాండ్, హార్టికల్చర్ పంటల సాగుపై అవగాహన కల్పించాలన్నారు. ఫాంపాండ్ పనుల్లో 3,500 టార్గెట్ కాగా ఇప్పటికి 190 మంది రైతులను గుర్తించామని వివరించారు. అలాగే ఉద్యాన పంటల సాగుకు 150 ఎకరాలు టార్గెట్ ఇవ్వగా ప్రస్తుతం 83 ఎకరాలను గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ భక్తవత్సలం, ఇన్‌చార్జ్ ఈసీ రామ్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నిర్మించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైన్లను నిర్మించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సత్యన్న డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట న్యూ ఎస్సీ కాలనీ సమస్యలపై ధర్నా చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి అందజేశారు. వారు మాట్లాడుతూ.. న్యూ ఎస్సీ కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్నపాటి వర్షానికే వీధులు నీటి మడుగులవుతున్నాయని తెలిపారు. అదే విధంగా కాలనీ పక్కనే వున్న వంకలో కోళ్ల వ్యర్థాలతో పాటు మురుగు నీరు ప్రవహిస్తుండటంతో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలే అవకాశం వుందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీ యూ నాయకులు బాలరాజు, బాబు, కాలనీవాసులు సులోచన, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలూరులో జాబ్‌మేళా

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమాదేవి ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ ఏరియా కోఆర్డినేటర్ వీరేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి 3:20 గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లుతో పాటు రెండు సెట్ల జిరాక్స్, నాలుగు పాస్ ఫొటోలతో రావాలని సూచించారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



రేషన్ ట్రక్కుల నిర్వాహకులతో కలిసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

- ఎండీయూ వాహనాల తొలగింపుతో ఉపాధి కోల్పోతున్న ఆపరేటర్లు, హెల్పర్లు
- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధిని కలిస్తూ రేషన్ ట్రక్కులను ప్రవేశపెట్టిందని తెలిపారు. అయితే నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎండీయూ ఆపరేటర్ల ఉపాధిని కొల్లగొడుతూ వారిని వీధి చేస్తున్నారన్నారు. బుధవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా నిరుద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా 18 వేల మందికి పైగా ఉపాధి పొందారని, 18 వేల ట్రక్కులు రోడ్లపై నడుస్తూ పేదల చెంతకే రేషన్ బియ్యాన్ని అందించాయన్నారు. అయితే నేడు కూటమి అనుసరిస్తున్న విధానాలతో వేలాది మంది రేషన్‌ట్రక్కుల నిర్వాహకులు, హెల్పర్లు ఉపాధిని కోల్పోయి, వాహనాలకు నెలసరి కంతులు చెల్లించలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని నియోజకవర్గంలో దాదాపు వంద మంది రేషన్ ట్రక్కులు నిలిపివేయడంతో దాదాపు రెండు వందల మందికి పైగానే ఉపాధిని కోల్పోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ వాహనాల తొలగింపుపై పునరాలోచించాలన్నారు.

ఆదోనిలో అవినీతి తాండవం..

ఇటీవల కాలంలో ఆదోనిలో అవినీతి తాండవిస్తోందని మాజీ ఎమ్మెల్యే అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతి పనికి ఓ రేటును నిర్ణయించారన్నారు. గతంలో భూకబ్జాలు, భూదందాలంటూ తనను అప్రతిష్టపాలు చేశారని, అయితే నేడు కూటమి పాలనలో రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు మార్చి స్థలాలను ఆక్రమించుకుంటున్నారన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారిందన్నారు. కూటమి పాలనలో ఆదోని చరిత్రలో లేనివిధంగా ఇసుక, గ్రావెల్, గరుసు వ్యాపారాలు పెచ్చుమీరిపోయాయని తెలిపారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు.

మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు

కౌన్సిలర్లు నిజాయితీకి కట్టుబడి ఉండడం వల్ల చైర్మన్ పదవిని ఏకగ్రీవంగా దక్కించుకున్నారన్నారు. జగనన్న, తనపై నమ్మకం ఉంచి పాలకవర్గ సభ్యులు కౌన్సిల్‌లో ఒకేతాటిపై నిలుస్తూ చైర్మన్ పదవిని 41వ వార్డు లోకేశ్వరికి కట్టబెట్టడం హర్షణీయమన్నారు. పాలకవర్గ సభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతిపాదించిన తాగునీటి పథకాలకు సంబంధించి అప్పుడే నిధులు మంజూరయ్యాయని, అయితే నేడు కూటమి ఎమ్మెల్యే తాను ప్రత్యేకంగా తాగునీటి పథకాలకు నిధులు మంజూరు చేయించానని చెప్పుకుంటూ ప్రచారం చేసుకుంటారన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో అందని రేషన్

ఎమ్మిగనూరుటౌన్: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలోని పేద ప్రజలకు రేషన్ బియ్యం అందడం లేదని సీపీఐ నాయకుడు భాస్కర్ యాదవ్, పట్టణ కార్యదర్శి రంగన్న ఆరోపించారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్‌కు వినతి పత్రం ఇచ్చి మాట్లాడారు. ఈనెల 17వ తేదీలోగా రేషన్ బియ్యం కార్డుదారులకు పంపిణీ చేయకపోవడంతో ఆనెల రేషన్ బియ్యం కోటాను లబ్ధిదారులు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. పట్టణంలో ఐదుకు పైగా రేషన్ దుకాణాలను సీజ్ చేయడంతో ఇన్‌చార్జ్ డీలర్ల ద్వారా రేషన్ బియ్యం పంపిణీని సకాలంలో అధికారులు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఈనెల రేషన్ బియ్యం అందేలా జిల్లా పౌరసరఫరా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దాదావలి, కేసీ జబ్బార్, మల్లికార్జున గౌడ్, సుంకన్న, నాగరాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీకి ఆద్యుడు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ



రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: దేశంలో టెక్నాలజీకి ఆధ్యుడు మహానేత భారత రత్న, దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఖాశింవలి అన్నారు. దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఇంటర్నెట్ సేవలను ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చి గ్రామ పంచాయతీలకు కేంద్రం ద్వారా నేరుగా నిధులు మంజూరు చేసిన ఘనత ఆయనదే అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగలదిన్నె షబ్బీర్, ఆసిఫ్, నరసప్ప, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలు శుభ్రం చేయండి

ఆదోని సెంట్రల్: మండిగిరి పంచాయితీ పరిధిలోని తిరుమల నగర్, ఆర్‌ఎస్‌ఏ కాలనీల్లో మురుగు కాలువలను శుభ్రం చేయాలని కాలనీ వాసులు ఎంఆర్.ప్రసాద్, ఎండి. రఫిక్, మనోహర్, రామాంజినేయులు, బాబురావు, వీరేష్ బాబు, సంతోష్ కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ.. కాలువల్లో చెత్తచెదారం పేరుకు పోవడంతో మురుగునీరు ముందుకు పోవడం లేదన్నారు. నీరు నిల్వ ఉంటూ దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు వృద్ధి చెంది రాత్రిళ్లు నిద్ర లేకుండా చేస్తున్నాయని వాపోయారు. కాలువలను శుభ్రం చేయాలని పంచాయతీ అధికారులకు, ఎమ్మెల్యేకు కూడా విన్న వించినా పట్టించుకోవడం లేదన్నారు. కాలువలు నిండి మురుగు నీరు తిరిగి ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువలను శుభ్రం చేసి మురుగు నీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



కాల్వలో నిల్వవున్న మురుగు నీరు